క్లుప్తంగా

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

చిట్యాల: మండలంలోని చింతకుంట రామయ్యపల్లిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో మొదలైన గొడవ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణకు దారి తీసింది. సమాచారం అందుకున్న చిట్యాల సెకండ్ ఎస్సై శాఖాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను వెళ్లగొట్టారు. కాగా ఈ దాడిలో సర్పంచ్ మధువంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిజ్జం వేణుకు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మడికొండ రవీందర్‌రావు, దేవేందర్‌రావులకు గాయాలు అయ్యాయి. దీంతో వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకుని మెరుగైన వైద్యం కోసం పరకాల, వరంగల్ ఆస్పత్రులకు తరలివెళ్లారు. ఈ దాడిపై ఇరు వర్గాలకు చెందిన నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు.

బతుకమ్మ పండుగ సందడి



ఏటూరునాగారంలో వివిధ రకాల పూలను విక్రయిస్తున్న వ్యాపారులు

ఏటూరునాగారం/టేకుమట్ల : ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించే పండుగల్లో సద్దుల బతుకమ్మ, దసరా ప్రధాన పండగలు ముఖ్యమైనవి. నేడు(ఆదివారం) సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా శనివారం మండల కేంద్రం వ్యాపార సముదాయాలు, పూల వ్యాపారుల వద్ద ప్రజలు కిక్కిరిసి ముందు రోజే పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ పూల రాశులతో ప్రధాన రోడ్డు అలంకరించినట్లు కనువిందు చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు జనాలతో రద్దీగా వాహనాల రాకపోకలకు కాస్త అంతరాయం కలిగింది.

వచాతి గిరిజనుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

నర్సంపేట : వచాతి గిరిజనుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో వర్గ, సామాజిక అణచివేతలపై పోరాడాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వచాతి వీర మహిళల అభినందన సభ శనివారం బెంబేలి మలహాల్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 1992లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాలో ఆదివాసీ గిరిజన గ్రామం వచాతిపై ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందనే నెపంతో పోలీసు, అటవీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పురుషులపై దాడి చేయడమే కాకుండా, పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారన్నారు. బాధిత మహిళలు, గిరిజనులకు అండగా తమిళనాడు గిరిజన సంఘం, ఐద్వా, ఏఐకేఎస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం తదితర వామపక్ష ప్రజాసంఘాల సుదీర్ఘ పోరాటంతో దాదాపు 215 మంది దోషులకు మద్రాస్ హైకోర్టు శిక్ష విధించి బాధిత గిరిజన మహిళలకు న్యాయం చేసిందన్నారు. ఈ తీర్పు దేశంలోని దళిత గిరిజన, బడుగు బలహీన వర్గాలకు బలం చేకూరుస్తుందన్నారు.

'చల్లా'ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ఆత్మకూరు : ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి కోరారు. మండలంలోని పెద్దాపూర్, లింగమడుగుపల్లె, అక్కంపేట, అగ్రంపహాడ్ గ్రామాల్లో శనివారం బూత్‌స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వివరించాలన్నారు. నియోజకవర్గంలో ధర్మారెడ్డి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, దానికి అనుగుణంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.

'బూటకపు హామీల బీఆర్ఎస్‌ను ఓడించాలి'

శాయంపేట : ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నోటిఫికెషన్లు విడుదల చేసి మళ్లీ రద్దు చేయడం కేసీఆర్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ఉద్యోగాల కోసం అప్లై చేసిన నిరుద్యోగ యువత లక్షల రూపాయాలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారని అన్నారు. కానీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. నిరుపేద బిడ్డలను బలిగొంటున్న బీఆర్ఎస్‌ను ఓడించి భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని, చదువుకున్న బిడ్డల కోసం తల్లిదండ్రులు, ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారిని మంగళగౌరి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోడెం రమేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి అలంకరణలో..

మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ప్రత్యేకంగా పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

లక్ష పుష్పార్చన..

ఏటూరునాగారంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష పూలతో పుష్పార్చన కార్యక్రమాన్ని అర్చకుడు సుదర్శనస్వామి జరిపించారు. అమ్మవారికి భక్తులు పుష్పాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయిబాబా ఆలయ చైర్మన్ మెర్గు సత్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద శాకంబరీ అవతారంలో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహా అన్నదానం

వెంకటాపురం(ఎం) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద శనివారం పరమేశ్వర బ్రిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం కార్యక్రమాన్ని యజమాని రామిడి శ్రీరాంరెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై చల్ల రాజు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై తాజుద్దీన్ హాజరై అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్నదానం మహా గొప్పదానమని కొనియాడారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీరాంరెడ్డిని అభినందించారు. అనంతరం ఎస్సై రాజు దుర్గామాతకు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్సైని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడబోయిన అశోక్, వివిధ పార్టీల నాయకులు మిల్కూరి ఐలయ్య, సాద యాదగిరి, ఆర్.కర్ణాకర్‌రెడ్డి, చీకూర్తి రమేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పు పూర్ణేందర్, పల్నాటి సురేష్, చింతిరెడ్డి రమణారెడ్డి, సదాచారి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అవతారంలో..

గోవిందరావుపేట : మండలంలోని పస్రా రామాలయంలో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు శనివారం గ్రామంలోని తల్లిదండ్రులు, భక్తులు చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సాంసోత్ రాజన్న విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులకు పలక, బలపాలను అందించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఏటూరునాగారం: ముత్యాలమ్మ ఆలయంలో శాకంబరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: బోనాలతో వస్తున్న మహిళలు



గోవిందరావుపేట: అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో లలితాదేవిగా..



సాయిబాబా ఆలయంలో పుష్పార్చన..



వెంకటాపురం(ఎం): అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తాజుద్దీన్

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి : ఐఎన్‌టీయూసీ తాడ్వాయి మండల అధ్యక్షుడిగా బండారి శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే సీతక్కకు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకత్వానికి బండారి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్‌ముదిరాజ్, సీనియర్ నాయకుడు అరెం లచ్చుపటేల్, సర్పంచ్ ఇర్ప సునిల్ దొర, గోవిందరావుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నర్సయ్య, నాయకులు సాధు చక్రపాణి, పిట్టల మహేందర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రమేష్

మహదేవపూర్: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కమ్మల రమేష్ (26) అదృశ్యమైనట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ రెండు రోజుల కింద ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి మల్లయ్య శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెన్సిల్, చాక్‌పీస్‌పై బతుకమ్మలు

- తొమ్మిది రకాల బతుకమ్మలను తయారు చేసిన రజనీకాంత్





రజనీకాంత్ తయారు చేసిన తొమ్మిది రకాల మైక్రో బతుకమ్మలు



రజనీకాంత్

కాటారం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శణమైన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెన్సిల్ గ్రాఫైట్‌పై, చాక్‌పీస్‌లపై అతి చిన్న పరిమాణంలో బతుకమ్మ ఆకృతిని రూపొందించి అబ్బురపర్చారు కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాలకు చెందిన ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. మూడు రోజుల పాటు శ్రమించి మూడు మిల్లీమీటర్ల ఎత్తు, రెండు మిల్లీమీటర్ల వెడల్పుతో పెన్సిల్ గ్రాఫైట్‌పై బతుకమ్మను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. అంతేకాకుండా తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగకు సంబంధించి తొమ్మిది రకాల బతుకమ్మ ఆకృతులను పెన్సిల్ గ్రాఫైట్, చాక్‌పీస్, పెన్సిల్ ఉడ్‌లపై చైనాక్లేతో వివిధ ఎత్తుల్లో తయారు చేసినట్లు పేర్కొన్నారు. చాక్‌పీస్‌లపై మొదటి బతుకమ్మ 1.5 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటర్ వెడల్పు, 2వ బతుకమ్మ 1.2 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటరు వెడల్పు, 3వ బతుకమ్మ 1 సెంటీమీటరు ఎత్తు, 9 మిల్లీమీటర్ల వెడల్పు, 4వ బతుకమ్మ 8మిల్లీ మీటర్ల ఎత్తు, 8 మిల్లీమీటర్ల వెడల్పు ఏర్పాటు చేశారు. అలాగే పెన్సిల్‌పై 5వ బతుకమ్మను 3.8సెంటీమీటర్ల ఎత్తు, 6మిల్లీ మీటర్ల వెడల్పు, 6వ బతుకమ్మను 1.3సెంటీమీటర్ల ఎత్తు, 2 మిల్లీమీటర్ల వెడల్పు, 7వబతుకమ్మ చాక్‌పీస్‌పై 5మిల్లీమీటర్ల ఎత్తు, 6 మిల్లీమీటర్ల వెడల్పు, 8వ బతుకమ్మ చాక్‌పీస్‌పై 4.5 సెంటీమీటర్ల ఎత్తు, 1 సెంటీమీటరు వెడల్పు, 9వ బతుకమ్మ ప్రపంచంలోనే అతిచిన్న బతుకమ్మ పెన్సిల్ గ్రాఫైట్‌పై 3మిల్లీమీటర్ల ఎత్తు 2మిల్లీమీటర్ల వెడల్పుతో తయారు చేశారు. తన ఆర్ట్స్ ద్వారా రజనీకాంత్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ తయారు చేసిన సూక్ష్మ ఆకృతులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సరిత శ్రీనివాస్‌తో పాటు 30 మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, సర్పంచ్ కుమారస్వామి, సీనియర్ నాయకుడు కోట రవి, వాల యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీలో..



పార్టీలో చేరిన వారితో శ్రీధర్‌బాబు

మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మడప సమ్మయ్యతో పాటు బీజేపీ నాయకుడు తాటి పోచయ్య శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇనుగొండ వెంకట్‌రెడ్డి, దుర్గయ్య, తాటి లచ్చయ్య, రాజబాపు, రాజు తదితరులు ఉన్నారు.

అమరుల సేవలు మరువలేనివి



అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం : పోలీస్ అమరవీరులు అందరికి స్ఫూర్తిదాయకమని స్థానిక సీఐ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు సీఐ, ఎస్సై కృష్ణప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆత్మ శాంతించాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అసువులుబాసిన వారి సేవలు మరవలేనివి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కల్పిస్తూ వారి క్షేమమే తమ క్షేమంగా భావిస్తామన్నారు. సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్ శాంతి ర్యాలీ నిర్వహించారు. అలాగే క్రాస్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కొవ్వొత్తులతో పోలీసు అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘాలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

టేకుమట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, రాష్ట్ర ప్రజలు తప్పకుండా కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా భూపాలపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు గెలుపును ప్రజలు ఎప్పుడో నిర్ణయించారని తెలిపారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజల మధ్యకు వచ్చి చెప్పే మాయమాటలను నమ్మరాదని, నిరంతరం ప్రజల కోసం పని చేసే వ్యక్తిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఓట్ల కోసమే రాజకీయం చేసే ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై, సర్పంచ్

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని తాళ్లపాడులో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను సర్పంచ్ మేడబోయిన అశోక్‌తో కలిసి స్థానిక ఎస్సై చల్ల రాజు పరిశీలించారు. బతుకమ్మ విగ్రహం వద్ద మహిళలు ఆటలాడిన అనంతరం సమీపంలోని లింగయ్యకుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారని అశోక్ వివరించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ వద్ద జరిగే దసరా ఏర్పాట్లను పరిశీలించి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న నాయకులు



గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన మాలోత్ మోతిలాల్ శనివారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు నూనావత్ మహేష్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మోతిలాల్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఆయన వెంట నాయకులు రాంచందర్, రమేష్, లక్ష్మణ్, వెంకటేష్, చిన్నా నాయక్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పీఆర్వోకు..

ములుగు : జెడ్పీ చైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శాసనసభ అభ్యర్థి బడే నాగజ్యోతి పీఆర్వో జంగిలి రవితేజను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు శనివారం పరామర్శించారు. డబుల్ టైఫాయిడ్, డెంగీ విష జ్వరంపై ఆరా తీశారు. సీనియర్ నాయకుడు గండ్రకోట సుధీర్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామానికి చెందిన కుందూరు భగవాన్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల హనుమకొండలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతి రెడ్డి శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కూర మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కాల్వ సమ్మిరెడ్డి, కొక్కుల సదానందం, తదితరులు ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై అశోక్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలు, సామగ్రి, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు.

సీఐ ఆధ్వర్యంలో..

వాజేడు : మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై శనివారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దన్నారు. సివిల్ పోలీసులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: ములుగు జిల్లా జంగాలపల్లికి చెందిన ధరంసోత్ నగేష్ అనే వ్యక్తి.. ఈ నెల 15న చిట్యాలకు వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి అతడికి శనివారం ఎస్సై జంగిలి రమేష్ చేతుల మీదుగా నగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సురేందర్, కోమలను ఎస్సై అభినందించారు. అనంతరం నగేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.